
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

గురువారం 27 ఫిబ్రవరి 2025



కోటప్పకొండ కింద భారీ విద్యుత్ ప్రభలు



ప్రత్యేక అలంకరణలో త్రికోటేశ్వరుడు




కోటప్పకొండపై భక్తులు

శివాయ.. రుద్రాయ

- భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు
- త్రికోటేశ్వరస్వామికి నేత్రపర్వంగా లింగోద్భవ అభిషేకాలు
- కోటయ్యస్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి ఆనం
- కొలువుతీరిన 20 భారీ విద్యుత్ ప్రభలు..
- శివనామస్మరణతో మార్మోగిన అమరావతి, క్వారీ, గోవాడ, కాకాని

7లో

హరహర శంభో శంకర.. ఓం నమః శివాయ.. శివాయ రుద్రాయ.. చేదుకో కోటయ్య చేదుకో.. నామస్మరణలతో శైవక్షేత్రాలు మారుమ్రోగగా.. శివయ్య దర్శనాలతో భక్తులు తరించారు. బుధవారం మహాశివరాత్రి మహోత్సవాలు, కోటయ్య తిరునాళ్లు అత్యంత భక్తిశ్రద్ధల మధ్య జరిగాయి. ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ భక్త జన సందోహంతో కిటకిట లాడింది. త్రికూటాద్రిపై త్రికో టేశ్వర స్వామి తిరునాళ్ల కన్నుల పండువగా జరిగింది. లక్షలాది మంది భక్తులు కోటయ్య స్వామిని దర్శించుకుని విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్ధరాత్రి వరకు కొండకు భక్తులు తరలి వస్తూనే ఉన్నారు. అర్ధరాత్రి త్రికోటేశ్వరస్వామికి లింగోద్భవ అభిషేకం వైభవంగా జరిగింది. తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదా కల్పించడంతో ప్రభుత్వం తరపున దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్వామికి పట్టువస్త్రాలు, వెండి ప్రభ సమర్పించారు. వివిధ గ్రామాల నుంచి తరలి వచ్చిన 20 భారీ విద్యుత్ ప్రభలు కోటప్పకొండ దిగువున కొలువు దీరాయి. విద్యుత్ కాంతుల్లో ప్రభలు భక్తులకు కనువిందు చేయగా సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలోని అమరావతిలోని అమరేశ్వరాలయం, పెదకాకానిలోని మల్లికార్జునస్వామి వారి ఆలయం, క్వారీ, గోవాడ క్షేత్రాలు భక్తజనంతో కిటకిటలాడాయి.



ప్రత్యేక అలంకరణలో అమరావతి అమరేశ్వర స్వామి



కోటప్పకొండలో త్రికోటేశ్వరుడికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే అరవిందబాబు



సంగం జాగర్లమూడిలో సంగమేశ్వరుడికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న మంత్రి మనోహర్



అమర్తలూరు : గోవాడలో బాల కోటేశ్వరుడిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు





క్వారీలో భక్తుల రద్దీ



ప్రత్యేక అలంకరణలో కాకాని మల్లేశ్వరుడు



బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీ

నేడు పట్టభద్రుల పోలింగ్

- బ్యాలెట్ బాక్సులతో కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- గుర్తింపు కార్డు ఉంటేనే ఓటు వేసేందుకు అనుమతి



కర్లపాలెంలో పోలింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో గ్లోరి, తహసీల్దార్ సుందరమ్మ

7

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల దుర్మరణం

నర్సింగ్ విద్యార్థులకు విదేశీ భాషలపై శిక్షణ

» ప్రతిపాదనలు పంపాలని డీఎంఈకి మంత్రి ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): నర్సింగ్ విద్యార్థులకు విదేశీ భాషలపై శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ఆరోగ్య శాఖ సిద్ధమైంది. తద్వారా వారు విదేశాల్లో సైతం ఉద్యోగ అవకాశాలు పొందేందుకు మార్గం సుగమం అవుతుందని భావిస్తోంది. ఈ నేపథ్యంలో విదేశీ భాషలపై శిక్షణకు సంబంధించి సమగ్ర ప్రతిపాదనలు పంపాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ)ను ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. తొలుత 13 ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో ఇలాంటి కోర్సులను ప్రవేశ పెట్టాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. విదేశాల్లో ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి నర్సింగ్ విద్యార్థుల భాష, కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరచడానికి ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థతో కలిసి ఈ శిక్షణ ఇవ్వాలని ఆరోగ్యశాఖ ఆలోచిస్తోంది. ఈ విషయంపై మంత్రి సత్యకుమార్ సంబంధిత సీనియర్ అధికారులతో ఇటీవల చర్చించారు. సమగ్ర ప్రతిపాదనలు సమర్పించాలని డీఎంఈని ఆదేశించారు. కాగా, దీనిపై డీఎంఈ ఇప్పటికే 7 వేల మందికి పైగా నర్సింగ్ విద్యార్థుల అభిప్రాయాలు, భాషా ప్రాధాన్యతల గురించి అభిప్రాయాలు తీసుకుంది. ఎక్కువ మంది నర్సింగ్ విద్యార్థులు జర్మన్, జపనీస్, ఇంగ్లిష్, ఫ్రెంచ్ వంటి భాషలను నేర్చుకునేందుకు ఉత్సాహంగా ఉన్నట్టు తెలిసింది.

పీసీసీఎఫ్ ఎంపికకు కమిటీ నియామకం

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ నుంచి రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ (పీసీసీఎఫ్) పోస్టుకు తగిన అధికారిని ఎంపిక చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం పీసీసీఎఫ్‌గా ఉన్న చిరంజీవ్‌చౌదరి ఈనెల 28న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో అపెక్స్ స్కేల్‌తో కూడిన ఐఎఫ్ఎస్ అధికారిని పీసీసీఎఫ్‌గా ఎంపిక చేయడానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన కమిటీని నియమించారు.

శివరాత్రి స్నానాలకు వెళ్లి 9మంది మృతి

» గోదావరిలో మునిగి ఐదుగురు విద్యార్థులు..

» శ్రీశైలంలో కొడుకును రక్షించబోయి తండ్రీ..

» బలివే దగ్గర తమ్మిలేరులో అన్నదమ్ములు..

రాజమహేంద్రవరం, పెనుగంచిప్రోలు, నున్నిపెంట, పెదవేగి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నదుల్లో స్నానానికి వెళ్లిన తొమ్మిది మంది మృత్యువాతపడ్డారు. శ్రీశైలంలో నీటిలో మునిగిపోతున్న కొడుకును రక్షించబోయి తండ్రి, బలివే దగ్గర తమ్మిలేరులో అన్నదమ్ములు, గోదావరి నదిలో మునిగిపోతున్న స్నేహితుల రక్షణ కోసం వెళ్లిన విద్యార్థులు చనిపోయారు. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తాడిపూడికి చెందిన గర్రె ఆకాశ్(17), తిరుమలశెట్టి పవన్(19), పడాల దేవదత్త సాయి(18), పడాల రామ దుర్గాప్రసాద్(19), అనిశెట్టి పవన్ గణేశ్(17) తోపాటు మరో ఏడుగురు శివరాత్రి స్నానానికి బుధవారం గోదావరి ఇసుక ర్యాంపు వద్దకు వెళ్లారు. అక్కడ ఇసుక మేటలు ఉన్నాయని మరింత ముందుకు వెళ్లారు. నదిలో సుమారు పది అడుగుల దూరం వెళ్లిన తర్వాత నీళ్లు బాగా నీలం రంగులో ఉన్నాయని, ముగ్గురు మరింత ముందుకు వెళ్లారు. అంతే.. అకస్మాత్తుగా నీటిలోకి జారిపోయారు. వాళ్లను రక్షిద్దామని వెళ్లిన మరో ఇద్దరు కూడా పైకి రాలేకపోయారు. దీంతో ఐదుగురూ ప్రాణాలు విడిచారు. మిగతా స్నేహితుల అరుపులతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. విషయం తెలియగానే కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహకిశోర్ అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. నదిలో గాలించి ఐదుగురి మృతదేహాలను బయటకు తీశారు. విద్యార్థులంతా ఒకే ఊరు, ఒకే వీధికి చెందిన వాళ్లు కావడంతో గ్రామం శోకంలో మునిగిపోయింది.

శ్రీశైలంలో తండ్రీకొడుకులు..



తండ్రీకొడుకుల మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం కొల్లికుళ్ల గ్రామానికి చెందిన పెరుగు గురవయ్య (35), అతడి కుమారుడు వాసు (11) శ్రీశైలం వద్ద కృష్ణా నదిలో జరిగిన ప్రమాదంలో మృతి చెందారు. ఈ ప్రాంతానికి చెందిన 40 మంది భక్తులు శ్రీశైలం వెళ్లారు. బుధవారం స్నానాలు చేసేందుకు నదిలోకి దిగారు. ముందుగా కుమారుడు వాసు నీటిలోకి దిగి.. కాలు జారి కొట్టుకుపోతుండగా అతడిని రక్షించేందుకు వెళ్లిన తండ్రి కూడా అదృశ్యమయ్యారు. మత్స్యకారులు మృతదేహాలను బయటకు తీశారు.

వైసీపీ చేసిన పాపం

తాడిపూడిలో ప్రమాదం జరిగిన ప్రదేశంలో ఇసుక ర్యాంపు ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎక్కడపడితే అక్కడ డ్రెడ్జింగ్ చేయడంతో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతుల్లోనే యువకులు మృత్యువాతపడ్డారు. ఇక్కడ కనీసం హెచ్చరిక బోర్డులు కూడా లేవు.

తమ్మిలేరులో అన్నదమ్ములు..

ఏలూరు జిల్లా ముసునూరు మండలం బలివే శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి వచ్చిన అన్నదమ్ములు తమ్మిలేరులో స్నానానికి దిగి చనిపోయారు. లింగపాలెం మండలం తిమ్మక్కపాలేనికి చెందిన పేరిచర్ల మారేష్, మంగమ్మ దంపతులు, వారి కుమారులు మునియ్య, మణికుమార్ బంధువులతో కలిసి బలివే వచ్చారు. తమ్మిలేరులో స్నానాలు చేసి, స్వామివారి దర్శనానికి బయలు దేరారు. కుమారులిద్దరూ కొద్దిసేపు స్నానం చేసి వస్తాం.. మీరు వెళ్లండని తల్లిదండ్రులకు చెప్పారు. దర్శనం పూర్తయినా.. కుమారులిద్దరూ రాకపోవడంతో వెతుక్కుంటూ తమ్మిలేరు దగ్గరకు వచ్చారు. మునిపల్లె సమీపంలో మణికుమార్(18) మృతదేహం కనిపించింది. మరో కుమారుడి కోసం వెతుకుతుండగా నీటిలో గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలకు మునియ్య(20) మృతదేహం కనిపించింది. తల్లిదండ్రులు, బంధువుల రోదనలతో ఆ ప్రాంతం నిండిపోయింది.

రీ సర్వే డ్యూటీలో ఉన్నా హాజరు తప్పనిసరి

» రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ సర్వేయర్లకు హాజరు తప్పనిసరి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రీ సర్వే, స్వామిత్వ, ఇతర విధుల కోసం గ్రామాలు, మండలాలు మారి వేరోచోట విధులు నిర్వర్తించే వారికి కూడా హాజరు తప్పనిసరి చేస్తూ భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ జి. జయలక్ష్మి ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు వారి హాజరుపై నిర్దిష్టమైన ఆదేశాలివ్వాలని గ్రామ, వార్డు సచివాలయాల విభాగానికి ఆమె లేఖ రాశారు. ఈ నేపథ్యంలో రీ సర్వే విధుల్లో భాగంగా సొంత మండలం లేదా ఇతర మండలాల్లో పనిచేసే వారు స్థానిక గ్రామ, వార్డు సచివాలయాల్లో హాజరు నమోదు చేసుకోవాల్సిందేనని గ్రామ, వార్డు సచివాలయాల విభాగం కార్యదర్శి కాటమనేని భాస్కర్ తాజాగా ఉత్తర్వులు జారీచేశారు. రీ సర్వే పనుల్లో ఉన్నామని, తమకు హాజరు మినహాయించాలని పలువురు సర్వేయర్లు కొంతకాలంగా కోరుతున్నారు. అయితే ఇతర మండలాలకు డిప్యూట్ అయిన వారు రీసర్వే పనులు మానేసి ఇతర కార్యకలాపాల్లో బిజీగా ఉండిపోతున్నారన్న ఫిర్యాదులున్నాయి. ఈ నేపథ్యంలో, రీ సర్వే పనుల కోసం ఇతర మండలాలకు డిప్యూట్ అయిన వారు స్థానిక గ్రామ, వార్డు సచివాలయాల్లో తప్పనిసరిగా హాజరు వేయాల్సిందేనని ప్రభుత్వం స్పష్టం చేసింది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

సరికొత్త ప్రపంచాన్ని చూపించబోతున్నాం

- ఆది పినిశెట్టి



'కథాబలంతో పాటు బలమైన భావోద్వేగాలు ఉన్న హారర్ చిత్రం 'శబ్దం'. ఇప్పటివరకూ వచ్చిన హారర్ చిత్రాలకు భిన్నంగా ఉంటుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది' అని హీరో ఆది పినిశెట్టి అన్నారు. 'వైశాలి' చిత్రం తర్వాత దర్శకుడు అరివళగన్, ఆది పినిశెట్టి కలయికలో వస్తున్న చిత్రమిది. సెవెన్ జీ ఫిల్మ్స్ శివ నిర్మించారు. మైత్రీ డిస్ట్రిబ్యూషన్, ఎన్ సినిమాస్ ద్వారా ఈ నెల 28న 'శబ్దం' చిత్రం తెలుగులో విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను ఆది పినిశెట్టి మీడియాతో పంచుకున్నారు. "ఇప్పటివరకూ ప్రేక్షకులకు తెలియని ఓ సరికొత్త ప్రపంచాన్ని 'శబ్దం' చిత్రంతో ప్రేక్షకులకు పరిచయం చేయబోతున్నాం. ఇందులో అతీత శక్తుల గురించి అన్వేషించే పరిశోధకుడి పాత్రలో కనిపిస్తాను. సాంకేతికంగా సినిమా చాలా ఉన్నతంగా ఉంటుంది. ఆత్మలకూ శబ్దానికి ఉన్న సంబంధం ఏమిటనేది ఆసక్తికరంగా ఉంటుంది. 'వైశాలి' లానే 'శబ్దం' కూడా నిజాయితీగా చేసిన ప్రయత్నం. తప్పక ఫలిస్తుందనే నమ్మకం ఉంది. సిమ్రాన్, లైలా పాత్రలు సినిమాలో కీలకం. తమన్ నేపథ్య సంగీతం అద్భుతంగా కుదిరింది. ప్రస్తుతం 'అఖండ 2, మరకతమణి 2, మయసభ, డ్రైవ్' చిత్రాలు చేస్తున్నాను" అని ఆయన చెప్పారు.

మార్చి నుంచి మళ్లీ షూటింగ్స్‌కు



'శివన్న' అని అందరూ ఆప్యాయంగా పిలుచుకునే కన్నడ టాప్ స్టార్ శివ రాజ్‌కుమార్ క్యాన్సర్ నుంచి కోలుకున్నారు. మార్చి నుంచి మళ్లీ షూటింగ్స్‌కు హాజరవుతానని ఓ ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు. తనకు క్యాన్సర్ ఉన్నట్లు గత ఏడాది ఏప్రిల్‌లో తెలిసిందనీ, కుటుంబ సభ్యులు, వైద్యులు ఇచ్చిన ధైర్యంతో చికిత్స చేయించుకున్నాననీ శివ రాజ్‌కుమార్ ఆ ఇంటర్వ్యూలో వెల్లడించారు. 'కీమో థెరపీ చేయించుకుని షూటింగ్‌కు వెళ్లిన రోజులు ఉన్నాయి. మొత్తానికి క్యాన్సర్ నుంచి బయట పడ్డా. చికిత్స అనంతరం ఇప్పుడు సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగా చేస్తున్నా. ఆహార నియమాలు పాటిస్తున్నా. మళ్లీ షూటింగ్స్‌లో పాల్గొంటున్నా. మార్చి 5న హైదరాబాద్ వెళ్లి రామ్‌చరణ్ సినిమా షూటింగ్‌లో పాల్గొంటా. ఆ సినిమాలో నా పాత్ర చాలా ప్రత్యేకంగా ఉంటుంది' అని చెప్పారు శివ రాజ్‌కుమార్.




ప్రభాస్, ప్రశాంత్ వర్మ చిత్రం..

ఎప్పటినుంచి?




హీరో ప్రభాస్ స్పీడ్ పెంచారు. చేతిలో ఉన్న సినిమాలు చకచకా పూర్తి చేస్తూ కొత్త వాటి మీద కూడా దృష్టి పెట్టారు. ప్రస్తుతం ఆయన 'రాజా సాబ్', 'ఫౌజీ' సినిమాలు చేస్తున్నారు. ఇవి కాకుండా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందే 'స్పిరిట్' సినిమా చేయాలి. ఇందులో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా ప్రభాస్ నటించనున్నారు. ఈ సినిమా షూటింగ్ కూడా వీలైనంత త్వరలో ప్రారంభించాలని ప్రభాస్ ఆలోచన. ఇప్పుడు ఆయన మరో కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారంటూ పరిశ్రమలో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఈ సినిమాకు ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహిస్తారనీ, ఈ సినిమాకు సంబంధించి ప్రభాస్ లుక్ టెస్ట్ కూడా జరిగిందని సమాచారం. ఇవి కాకుండా 'కల్కి పార్ట్ 2', 'సలార్ 2' చిత్రాలను ప్రభాస్ చేయాలి. ఇన్ని సినిమాలు ప్రభాస్ ఎప్పుడు, ఎలా చేస్తారు, వీటిల్లో ఏది ముందు మొదలవుతుందనేదే ఆ చర్చ.

సందేశం, వినోదం అలరిస్తాయి



బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తి తనయుడు మిమో చక్రవర్తి హీరోగా టాలీవుడ్‌కు పరిచయం అవుతున్నారు. ఆయన కథానాయకుడిగా మాధవ్ కోదాడ దర్శకత్వంలో మారుతి శ్యాం ప్రసాద్ రెడ్డి నిర్మించిన చిత్రం "నేనెక్కడున్నా'. ఈ నెల 28న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మిమో చక్రవర్తి మీడియాతో మాట్లాడుతూ.. 'చిన్నప్పటి నుంచి దక్షిణాది చిత్రాలు చూస్తూ పెరిగాను. నాకు తెలుగు సినిమాలో అవకాశం వచ్చిందని తెలియగానే నాన్న సంతోషించారు. 'ప్రయత్నలోపం లేకుండా కష్టపడు, నిజాయితీగా పనిచెయ్యి' అని చెప్పారు. సందేశం, వినోదం కలబోతగా దర్శకుడు 'నేనెక్కడున్నా' చిత్రాన్ని తీర్చిదిద్దారు. యాక్షన్ సీక్వెన్స్‌లు, పతాక సన్నివేశాల్లో వచ్చే మలుపులు ప్రేక్షకులను థ్రిల్ చేస్తాయి. ఈ చిత్రంతో హీరోగా తెలుగులో నిలదొక్కుకుంటాననే నమ్మకం ఉంది' అని చెప్పారు.

తెలుగులోకి 'ఛావా'



విక్కీ కౌశల్, రష్మిక జంటగా రూపుదిద్దుకున్న చారిత్రక చిత్రం 'ఛావా'. బాక్సాఫీసు వద్ద భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. పదకొండు రోజుల్లో ఈ సినిమా రూ. 417 కోట్లకు పైగా వసూళ్లను సాధించడంతో బాలీవుడ్ సంబరాలు చేసుకుంటోంది. దక్షిణాది సినిమా వచ్చి తమని చావు దెబ్బ తీసిందని వాపోతున్న సినీ వర్గాలు 'ఛావా' విజయంతో ఊపిరి పీల్చుకుంటున్నాయి. ఉత్తరాదిన విజయయాత్ర కొనసాగిస్తున్న ఈ సినిమా త్వరలో తెలుగు ప్రేక్షకులను పలకరించనుంది. ఈ సినిమా కోసం ఎదురు చూస్తున్న తెలుగు ప్రేక్షకుల కోసం తెలుగు వెర్షన్‌ను గీతా ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ మార్చి 7న విడుదల చేస్తోంది.

పెళ్లి నేపథ్యంలో పీరియాడిక్ చిత్రం



పెళ్లి నేపథ్యంలో హాస్యం, వ్యంగం కలబోతగా రూపొందుతున్న పీరియాడిక్ చిత్రం 'అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే'. రాజా దుస్సా దర్శకత్వంలో గాలి కృష్ణ నిర్మిస్తున్నారు. బుధవారం చిత్రబృందం టైటిల్ పోస్టర్‌ను ఆవిష్కరించింది. 1980లో వరంగల్ జిల్లాలో జరిగిన సంఘటన ఆధారంగా అల్లుకున్న కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు దర్శకుడు చెప్పారు. ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే కుటుంబ కథా చిత్రం ఇది, నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని నిర్మాత తెలిపారు.

రాక్షసుడు వస్తున్నాడు



కన్నడ హీరో ప్రజ్వల్ దేవరాజ్ నటించిన తాజా చిత్రం 'రాక్షస'. లోహిత్ హెచ్ దర్శకత్వంలో ఎంవీఆర్ కృష్ణ నిర్మించారు. ఈ చిత్రం విడుదల కొత్త తేదీకి మారింది. ఫిబ్రవరి 28కి బదులు మార్చి 7న 'రాక్షస' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు యూనిట్ బుధవారం తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: నోబిన్ పాల్, సినిమాటోగ్రఫీ: జైబిన్ పి. జాకబ్

గుండెలోన గట్టి సప్పుడు



నేటి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వివక్ష, సవాళ్ల నేపథ్యంలో రూపుదిద్దుకున్న చిత్రం 'నారి'. ఆమని ప్రధాన పాత్ర పోషించారు. సూర్య వంటిపల్లి దర్శకత్వంలో శశి వంటిపల్లి నిర్మించారు. మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 7న ఈ చిత్రం విడుదలవుతోంది. మహా శివరాత్రి సందర్భంగా 'గుండెలోన ఏదో గట్టి సప్పుడైనదే అంటూ సాగే గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. రమణ గోగుల ఆలపించగా, వినోద్ కుమార్ విన్ను స్వరపరిచారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: వి. రవికుమార్.

ఒగ్గు కళ నేపథ్యంలో




ఒగ్గు కళాకారుల జీవితాల నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం 'బ్రహ్మాండ'. ఆమని, జయరామ్, ఛత్రపతి శేఖర్ కీలకపాత్రలు పోషించారు. రాంబాబు దర్శకత్వంలో దాసరి సురేశ్ నిర్మించారు. దర్శకుడు చందు మొండేటి ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేసి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ 'ఒగ్గు కళాకారుల జీవితాల్లోని ఒడిదొడుకులను వెండితెరపై ఆవిష్కరించే ప్రయత్నం 'బ్రహ్మాండ' చిత్రం ద్వారా చేస్తున్నాం' అన్నారు. తెలంగాణ సంస్కృతి, పల్లె ప్రజల అనుబంధాలను దర్శకుడు తెరకెక్కించిన తీరు ఆకట్టుకుంటుందని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: వరికుప్పల యాదగిరి, సినిమాటోగ్రఫీ: కాసుల కార్తీక్

శివుని పాటతో చంద్రేశ్వర



సురేష్ రవి, ఆశ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'చంద్రేశ్వర'. మన సనాతన ధర్మం గొప్పతనాన్ని వివరిస్తూ దేవాలయాల నేపథ్యంలో సాగే ఈ సినిమాను జీవా పెరుమాళ్ వర్ధన్ దర్శకత్వంలో డాక్టర్ రవీంద్రాచారి నిర్మించారు. మహా శివరాత్రి సందర్భంగా సినిమాలోని శివుని పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'ఆర్కియాలజీ నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న సస్పెన్స్ థ్రిల్లర్ ఇది. డివోషనల్ టచ్‌తో పాటు మంచి కామెడీ కూడా సినిమాలో ఉంది. త్వరలో విడుదల చేస్తాం' అని చెప్పారు.

కొత్తదనంతో క్రైమ్ కథ



ఊహించని మలుపులు, భయానక సంఘటనలతో రూపొందుతున్న చిత్రం 'బ్లడ్ రోజెస్'. ఎంజీఆర్ దర్శకత్వంలో హరీశ్ కే నిర్మించారు. సీనియర్ నటుడు సుమన్, రంజిత్‌రామ్, అప్సర రాణి ప్రధాన పాత్రల్లో నటించారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. మహా శివరాత్రి సందర్భంగా చిత్రబృందం బుధవారం ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. భయపెట్టే కథనం, ఊపిరిసలపని ట్విస్టులతో మా క్రైమ్ కథా చిత్రం ఆద్యంతం ప్రేక్షకులను థ్రిల్ చేస్తుందని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: పెద్దపల్లి రోహిత్, సినిమాటోగ్రఫీ: శివకుమార్ ఓగిరెడ్డి.

PARAS




కోటప్పకొండలో అభిషేక పూజలో పాల్గొన్న భక్తులు

శివాయ.. రుద్రాయ

కోటప్పకొండ(నరసరావుపేట), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం గురువారం భక్త జన సందోహం మధ్య అత్యంత ఘనంగా జరిగింది. కోటప్పకొండపై కోటయ్య తిరునాళ్లతో పాటు అమరావతి అమరేశ్వరాలయం, పెదకాకాని భ్రమరాంబసమేత మల్లికార్జునస్వామి ఆలయం, అమృతలూరు మండలం గోవాడ శ్రీబాలకోటేశ్వస్వామి ఆలయం, చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ శ్రీబాలకోటేశ్వర స్వామి ఆలయాలతో పాటు శైవక్షేత్రాలు బుధవారం శివ నామస్మరణలతో మార్మోగాయి. కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి సన్నిధికి భక్తులు పోటెత్తారు. శ్రీత్రికోటేశ్వరస్వామి తిరునాళ్లతో కోటప్పకొండ ప్రాంతం జనసంద్రంగా మారింది. సాయంత్రం నుంచి భక్తుల రద్దీ అంతకంతకు పెరిగింది. తెల్లవారుజామున అర్చకులు బిందె తీర్థం, పంచామృతాలతో అభిషేకాలు చేసి స్వామికి విశేష అలంకారం చేశారు. అనంతరం స్వామి దర్శనానికి భక్తులను అనుమతించారు. కొండ దిగువన వున్న బొచ్చు కోటయ్యస్వామి వద్ద తలనీలాలను భక్తులు సమర్పించారు. ఆలయం వద్ద ఏర్పాట్లను ఎప్పటికప్పుడు ఈవో చంద్రశేఖరరావు, ట్రస్టీ రామకృష్ణ కొండలరావు పర్యవేక్షించారు. 2,500 పోలీసులు బందోబస్తులో


నాగేంద్రస్వామి పుట్టవద్ద భక్తుల పూజలు

పాల్గొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కలెక్టర్ అరుణ్‌బాబు, ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జేసీ సూరజ్, ఆర్డీవో మధులత, డీఎస్పీ నాగేశ్వరరావులతో పాటు వివిధ శాఖల అధికారులు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పరిశీలించారు.

స్వామికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి ఆనం

త్రికోటేశ్వరస్వామికి ప్రభుత్వం తరపున దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టువస్త్రాలను, వెండి ప్రభను సమర్పించారు. మంత్రి వెంట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఏడీసీ చంద్రకాంత్, డీసీ శ్రీనివాసరావు ఈవోలు చంద్రశేఖరరావు సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కనువిందు చేసిన ప్రభలు..

త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల సందర్భంగా వివిధ గ్రామాల నుంచి తరలి వచ్చిన 20 భారీ విద్యుత్ ప్రభలు కోటప్పకొండ దిగువన కొలువు దీరాయి. కొండపై ఆలయం, కొండ దిగువన ప్రభలు విద్యుత్ వెలుగుల్లో కాంతులీనాయి. విద్యుత్ వెలుగుల్లో కొండ ప్రాంతం దేదీప్యమానంగా వెలుగొందింది. ప్రభలపై సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఉదయం 11 గంటల కల్లా భారీ విద్యుత్ ప్రభలు కొండకు చేరుకున్నాయి. ప్రభల రాకతో చిలకలూరిపేట రహ దారి శోభాయమానంగా సాగింది. నరసరావుపేట రహదారిలో



సాధారణ ప్రభల రాకతో కోలాహలం నెలకొంది.


నరసరావుపేటలో ట్రాఫిక్ జామ్

ట్రాఫిక్‌లో చిక్కుకున్న మంత్రి ఆనం

కోటప్పకొండ తిరునాళ్లలో పలు మార్లు ట్రాఫిక్ జామైంది. స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం తిరుగు ప్రయాణంలో దాదాపు గంట పాటు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కాన్వాయ్ ట్రాఫిక్‌లో నిలిచిపోయింది. పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరించడంతో మంత్రి ఆనం ట్రాఫిక్ నుంచి బయటపడ్డారు. పెట్లూరివారిపాలెం, యలమందల రహదారిలో రాత్రి పది గంటల సమయంలో ట్రాఫిక్ స్తంభించింది. గంటల తరబడి భక్తులు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి తీవ్రంగా ఇక్కట్లు పడ్డారు. పోలీసుల ముందస్తు ప్రణాళికలు విఫలమవడంతో ట్రాఫిక్ కష్టాలు నెలకొన్నాయి.

వీఐపీల తాకిడి.. ఆదాయానికి గండి

కోటప్పకొండ తిరునాళ్లలో వీఐపీల తాకిడి భారీగా ఉంది. డీఎస్పీ కార్యాలయం నుంచి 15 వేలకు పైగా వీఐపీ, వీవీఐపీ పాసులు పంపిణీ చేసినట్లు సమాచారం. వీఐపీ క్యూలైన్ కిటకిటలాడింది. వీఐపీల పేరుతో వేలాది మంది స్వామి దర్శనం చేసుకున్నారు. దీంతో క్యూల్లో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీఐపీ పాసులు నియంత్రించి ఉంటే టిక్కెట్ కొని స్వామి దర్శనం చేసుకునేవారు. అయితే వారికి పాసులు జారీతో దేవస్థానం ఆదాయానికి రూ.లక్షల్లో గండి పడింది. వీఐపీల వాహనాలకు కొండపైకి అనుమతించడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీఐపీల సేవలో కొందరు అధికారులు తరించారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖరరావు, రాష్ట్ర మంత్రి టీజీ భరత్, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ప్రత్తిపాటి పుల్లారావు, కొలికపూడి శ్రీనివాసరావు, రామాంజనేయులు, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖరరావు, లేళ్ల అప్పిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, కలెక్టర్ అరుణ్‌బాబు, ఐజీ సర్వశేష్ఠ త్రిపాఠి, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, దర్శి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, మురుగుడు హనుమంతరావు, లావు రత్తయ్య, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ స్వామిని దర్శించుకున్నారు.

భక్తులకు చుక్కలు చూపించిన ఆర్టీసీ

కోటప్పకొండ తిరునాళ్లకు తరలివచ్చిన భక్తులకు ఆర్టీసీ చుక్కలు చూపించింది. అరకొరగా బస్సులు ఏర్పాటు చేసి భక్తులను ఇక్కట్లకు గురి చేసింది. బస్సులు లేక భక్తులు కాలినడకన ఘాట్ రోడ్డున కొండ కిందకు చేరుకున్నారు. వీఐపీల సేవలో తరించిన అధికారులు సామాన్య భక్తులను విస్మరించారు. సాయంత్రం వేళ భక్తులు రద్దీగా ఉన్న సమయంలో చాలా తక్కువ సంఖ్యలో బస్సులు ఏర్పాటుతో ప్రయాణికులు తోపులాటకు గురయ్యారు టికెట్ వసూలు చేసిన ఆర్టీసీ అధికారులు బస్సులు ఏర్పాటును విస్మరించి తమను నడిపిస్తున్నారంటూ భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

శైవక్షేత్రాలు.. భక్తజన సంద్రం

పెదకాకాని, అమరావతి, అమృతలూరు, పొన్నూరుటౌన్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శైవక్షేత్రాలు భక్తజన సంద్రంగా మారాయి. అర్ధరాత్రి లింగోద్భవ పూజల అనంతరం స్వామివార్లను భక్తులు దర్శించుకుని తరించారు. పెదకాకాని మల్లన్న సన్నిధి భక్తులతో కిటకిటలాడింది. మల్లేశ్వరస్వామి, భ్రమరాంబ అమ్మవార్లకు భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉభయదేవి సమేత కాకాని మల్లేశ్వరుడు గ్రామోత్సవంలో పెదకాకాని పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో తెల్లవారుజామున అమరేశ్వరుడికి తొలి అభిషేకం ధర్మకర్త వాసిరెడ్డి మురళీకృష్ణ ప్రసాద్ దంపతులు, ఈవో సునీల్‌కుమార్ సమక్షంలో జరిగింది.


అమరావతి : అమరేశ్వర స్నానఘాట్‌లో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు


పెదకాకాని : మల్లన్న సన్నిధిలో క్యూలో బారులు తీరిన భక్తులు


చేబ్రోలు : క్వారీలో తిరునాళ్ల సందడి


అమృతలూరు : గోవాడలో ప్రత్యేక అలంకరణలో శ్రీబాలకోటేశ్వరస్వామి, అభిషేక పూజల్లో పాల్గొన్న భక్తులు

అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామిని శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, జగన్మోహనరావు, కన్నా లక్ష్మీనారాయణ, వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులతో పాటు పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. గురువారం తెల్లవారుజామున అమరేశ్వరస్వామి వార్ల కల్యాణమహోత్సవం జరగనున్నది. కల్యాణమూర్తులకు గురువారం సాయంత్రం గ్రామోత్సవం నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అమృతలూరు మండలం గోవాడ శ్రీబాలకోటేశ్వస్వామికి అర్ధరాత్రి ప్రత్యేక పూజల అనంతరం దర్శనాలకు భక్తులను అనుమతించారు. మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు స్వామి వారిని దర్శించుకున్నారు. చేబ్రోలు మండలంలోని వడ్లమూడి క్వారీ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయంలో అర్ధరాత్రి నుంచి మూలవిరాట్ దర్శనానికి భక్తులు పోటెత్తారు. మహిళలు పొంగళ్లు వండి స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్, జ్యోతిర్మయి దంపతులు స్వామి వారికి వస్త్రాలు సమర్పించి అభిషేక పూజలలో పాల్గొన్నారు.

నేడు పట్టభద్రుల పోలింగ్

- బ్యాలెట్ బాక్సులతో కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- గుర్తింపు కార్డు ఉంటేనే ఓటు వేసేందుకు అనుమతి

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల పోలింగ్ గురువారం జరగనుంది. ఆరు జిల్లాల్లో పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి పోలింగ్ సామగ్రిని పీవోలకు అందజేసి రూట్ల వారీగా పోలింగ్ కేంద్రాలకు పంపించారు. గుంటూరులోని ఏసీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో రూట్ల వారీగా సిబ్బందికి సామగ్రి పంపిణీని బుధవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి, జేసీ భార్గవతేజతో కలిసి పరిశీలించారు. పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు రాత్రికి అక్కడే బస చేసి ఉదయం 7 గంటలకు ఏజంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సుకు సీలు వేసి సరిగ్గా 8 గంటలకు ఓటింగ్‌ని ప్రారంభిస్తారు. గుర్తింపు కార్డు ఉన్న ఓటర్లను మాత్రమే ఓటు వేయడానికి అనుమతిస్తారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తాడేపల్లి మండలంలో ఓటు హక్కుని వినియోగించుకోనున్నారు. మొత్తం 3,47,116 మంది ఓటర్లు ఉండగా 483 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆరు జిల్లాలు కలిపి 144 క్లిష్టమైన పోలింగ్ కేంద్రాలు, 9 అత్యంత సమస్యాత్మక, 57 సమస్యాత్మక, 273 సాధారణ కేటగిరీలుగా విభజించారు. 800 మంది ఓటర్ల కంటే తక్కువ ఉన్న పోలింగ్ బూత్‌లకు రెండు, అంతకంటే పెచ్చు ఓటర్లు ఉన్న బూత్‌లకు మూడు బ్యాలెట్ బాక్సులను కేటాయించారు.

ఓటు వేయాలంటే ఏదో ఒక ఐడీ తప్పనిసరి

ఓటరుగా నమోదైన వారు ఎన్నికల సంఘం జారీ చేసిన ఎలక్టోరల్ ఫొటో గుర్తింపు కార్డు చూపించి ఓటు వేయొచ్చు. ఒకవేళ ఈ కార్డు లేకపోతే ఆధార్/ డ్రైవింగ్ లైసెన్సు/పాన్/ఇండియన్ పాసు పోర్టు/ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్ స్థానిక సంస్థలు, ప్రైవేటు ఇండస్ట్రియల్ హౌసెస్ జారీ చేసిన సర్వీసు గుర్తింపు కార్డు చూపించి ఓటు వేయొచ్చు. ఎంపీ/ఎమ్మెల్సీ/ఎమ్మెల్యే/ఎమ్మెల్సీలు వారి గుర్తింపు కార్డులు చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. విద్యాసంస్థలు జారీ చేసిన సర్వీసు ఐడెండిటీ కార్డులు చూపించినా ఓటు వేయడానికి అనుమతిస్తారు. విశ్వవిద్యాలయం జారీ చేసిన డిగ్రీ/డిప్లొమా ఒరిజినల్ సర్టిఫికెట్ చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. దివ్యాంగులు అయితే వారికి కాంపిటెంట్ అథారిటీ జారీ చేసిన సర్టిఫికేట్, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన యూడీఐడీకార్డు చూపించాన ఓటు వేయడానికి అనుమతిస్తారు.


నరసరావుపేట : మునిసిపల్ బాలికల స్కూల్‌లో పోలింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ పీ అరుణ్‌బాబు, డీఆర్వో మురళి

ఓటరు స్లిపు తప్పనిసరి కాదు

ఓటరుగా నమోదైన పట్టభద్రులకు ఓటరు స్లిప్పు అందకపోయినా ఓటు వేయడానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఓటు వేయడానికి స్లిప్పు తప్పనిసరి కాదని ఏఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి తెలిపారు. పోలింగ్ బూత్ నంబరు. సీరియల్ నంబరు ప్రిసైడింగ్ అధికారికి చెప్పి ఒరిజినల్ గుర్తింపు కార్డు చూపిస్తే ఓటు వేయడానికి అనుమతిస్తారని స్పష్టం చేశారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

పోలింగ్ దృష్ట్యా ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించినట్లు ఆర్‌వో నాగలక్ష్మి తెలిపారు. కళాశాలలు, ఉన్నత విద్యా సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులు ఓటుహక్కు వినియోగించుకునేలా యాజమాన్యాలు క్యాజువల్ లీవులు, ఆలస్యపు అనుమతులు మంజూరు చేయాలన్నారు.


గుంటూరు : ఏసీ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఆర్వో కలెక్టర్


రేపల్లె : ఎన్నికల సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల దుర్మరణం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న వరి గడ్డి ట్రాక్టర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరు విద్యార్థులు దుర్మరణం పాలైన ఘటన పట్టణంలోని అచ్చంపేట రోడ్డులో బుధవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని వడ్డవల్లికి చెందిన తోట సంతోష్ కుమార్(15), కూరపాటి లిఖిత్(11)ది ఎదురెదురు గృహాలు. శివరాత్రి సందర్భంగా సంతోష్ కుమార్ తన తండ్రికి చెందిన ద్విచక్ర వాహనంపై లిఖిత్‌ను ఎక్కించుకొని అచ్చంపేట రోడ్డులో నిర్మలనగర్‌లో గల నాయనమ్మ గృహానికి బయలు దేరారు. గృహానికి సమీపంలోని సాయికృష్ణ థియేటర్ దాటగానే ఆగి ఉన్న గడ్డి ట్రాక్టర్‌ను వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఆ సమయంలో మంచు ఉండటంతో వరిగడ్డి ట్రాక్టర్ కన్పించకపోవటమే ప్రమాదానికి కారణంగా తెలుస్తుంది. ప్రమాదం జరిగిన వెంటనే ఇద్దరు విద్యార్థులు రోడ్డుపై పడటంతో సంతోష్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా లిఖిత్‌ను ఏరియా వైద్యశాలకు తరలించగా మృతి చెందాడు. స్థానికులు సమాచారాన్ని తల్లిదండ్రులకు, పోలీసులకు తెలపటంతో మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. సంతోష్‌కుమార్ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి చదువుతుండగా లిఖిత్ మరో ప్రైవేట్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. లిఖిత్ తండ్రి సుధీర్‌కు ఒక కుమార్తె కూడా ఉంది. సంతోష్‌కుమార్ తండ్రి జానకి రామయ్య పాస్టర్‌గా పని చేస్తుంటాడు. ఇరువురు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శివరాత్రి రోజునే ఇద్దరు విద్యార్థులు మృతి చెందటం వడ్డవల్లి ప్రాంతంలో విషాద ఛాయలు అలముకున్నాయి.


తోట సంతోష్‌కుమార్, కూరపాటి లిఖిత్ (ఫైల్)

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.85
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	78, 85, 95
చికెన్ విత్ స్కిన్	150.00
చికెన్ స్కిన్ లెస్	160.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

నేడే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- మూడు నియోజకవర్గాల పరిధిలో 34 పోలింగ్ కేంద్రాలు
- 24,493 మంది ఓటర్లు...బరిలో ఉన్న అభ్యర్థులు 25 మంది


పోలీసులకు ఎన్నికల విధులు కేటాయిస్తున్న అధికారులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ గురువారం జరగనుంది. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఎన్నికలకు విధులకు కావాల్సిన సామగ్రిని బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌తో పాటు రేపల్లె ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం పంపిణీ చేశారు.

ఓటర్లు 24,493...పోలింగ్ కేంద్రాలు 34

వేమూరు, బాపట్ల, రేపల్లె నియోజకవర్గాల పరిధిలో మొత్తం 24,493 మంది పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటింగ్‌లో భాగంగా నమోదై ఉన్నారు. వీరిలో పురుషులు 15,312 ఉండగా, మహిళలు 9,176 ఇతరులు ఐదుగురుగా ఉన్నారు. మూడు నియోజకవర్గాల పరిధిలో 34 పోలింగ్ కేంద్రాలలో పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకునేలా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను చేసింది

290 మంది సిబ్బంది విధుల్లో...

ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి మూడు నియోజకవర్గాల పరిధిలో 290 మంది వరకు సిబ్బంది ఎన్నికల విధుల్లో పాలు పంచుకోనున్నారు. అత్యంత పారదర్శకంగా ఎన్నిక జరిగేలా, ఎలాంటి అవకతవకలకు ఆస్కారమివ్వకుండా విధులు నిర్వర్తించాలని ఇప్పటికే సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలో భాగంగా మూడు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 267 మంది పోలీస్ సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. ఇందులో ఏఎస్పీ–1, డీఎస్పీలు ఇద్దరు, 7గురు సీఐలు, 13 మంది ఎస్ఐలు, మహిళా పోలీసులు 34 మంది, ఫ్లయింగ్ స్క్వాడ్‌కు సంబంధించి 12 టీంలు, ఎస్ఎస్‌టీ టీంలు 12 నిరంతరం విధుల్లో ఉండనున్నారు. 34 పోలింగ్ కేంద్రాలకు గాను 9 కేంద్రాలను క్రిటికల్‌గా గుర్తించి పటిష్ట భద్రతా ఏర్పాట్లను చేపట్టినట్లు పోలీస్ విభాగం చెబుతోంది.

ఎన్నికలకు సర్వం సిద్ధం : కలెక్టర్

బాపట్ల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా-గుంటూరు గ్రాడ్యుయేషన్ శాసనమండలి ఎన్నికలకు బాపట్ల జిల్లాలో సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. గురువారం జరగనున్న ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఓటుహక్కు ఉన్న ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. జిల్లాలోని 34 పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలలో ఉంటుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుబందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

ఎన్నికల అధికారులు నిబంధనలు పాటించాలి : ఆర్డీవో

రేపల్లె, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : పోలింగ్‌బూత్‌ల్లో విధులు నిర్వహించే ఎన్నికల అధికారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించి ఎమ్మెల్సీ ఎన్నికలను విజయవంతం చేసేలా కృషి చేయాలని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. ఎన్నికల అధికారులతో బుధవారం ఆర్డీవో సమీక్షించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే ఎన్నికల బూత్‌ల్లో అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. అనంతరం ఎన్నికల సిబ్బందికి ఎన్నికల మెటీరియల్‌ను అందించటంతో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు.

వేమూరు నియోజకవర్గంలో...

వేమూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు నియోజకవర్గంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజకవర్గ ఎన్నికల అధికారి సునీత పర్యవేక్షణలో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది వివిధ స్థాయిల బాధ్యతలను గుర్తించి ఆయా పోలింగ్ కేంద్రాలలో సామగ్రిని భద్రపరిచారు. 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు కేంద్రాల వద్ద ఓటర్లకు సౌకర్యంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు సుశీల తెలిపారు. దివ్యాంగ ఓటర్లకు, వృద్ధులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు కూడా వివరించారు.

● కర్లపాలెం : పోలింగ్ కేంద్రాలను బాపట్ల ఆర్డీవో గ్లోరి, కర్లపాలెం తహసీల్దార్ సుందరమ్మ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కర్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 412, 412ఎ బూత్‌లలో పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకుంటారన్నారు.

● పిట్టలవానిపాలెం : పిట్టలవానిపాలెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు పోలీసు సిబ్బంది సందర్శించి పరిశీలించారు.

మూతపడిన మద్యం దుకాణాలు

- దొడ్డిదారిన అనధికారికంగా విక్రయాలు

కొల్లూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు సీల్ వేశారు. అయినా నిర్వాహకులు దొడ్డిదారిన మద్యాన్ని అనధికారికంగా విక్రయాలు చేస్తున్నారు. దుకాణాలు మూసి వేసిన అనంతరం అనధికార విక్రయాలకు తెరలేపి ఒక్కో క్వార్టర్‌కు రూ.50 అదనంగా, ఫుల్ బాటిల్‌కు రూ.100-200లకు పైగా అధిక ధరలకు విక్రయాలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. పైగా పలుకుబడి కలిగిన వ్యక్తులకు, బడాబాబుల ఇంటి వద్దకే నిర్వాహకులు తమ సిబ్బందితో మద్యం సీసాలు పంపిస్తుండటం కొసమెరుపు. అనధికారిక విక్రయాలు నిలువరించాల్సిన ఎక్సైజ్ అధికారులు, నిర్వాహకులు బహిరంగంగా మద్యం విక్రయాలు చేస్తున్నప్పటికీ తమకేమి తెలియదన్నట్లుగా వ్యవహరించడం గమనార్హం.

జోరుగా కోడి పందాలు


కొల్లూరు వద్ద కోడి పందాలు వేస్తున్న చిత్రం

కొల్లూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : పోలీసు సిబ్బంది మహా శివరాత్రి బందోబస్తులో ఉండటంతో పందెం రాయుళ్లు ఒక్కసారిగా రెచ్చిపోయారు. బుధవారం కొల్లూరుతో పాటు మండల పరిధిలోని కోటిపల్లి, చినపులివర్రు వెళ్లే రహదారులపై కోడిపందాల బరులు వెలిశాయి. కొల్లూరులో కరకట్ట దిగువన ఇటుక కల్లాల్లో, కోటిపల్లి వద్ద కల్లాల్లో పగలంతా పందాలు జోరుగా సాగాయి. అనంతవరంలో సాయంత్రం నాలుగు గంటల నుంచి కోడి పందాలు వేసేందుకు నిర్వాహకులు సిద్ధం చేశారు. కొల్లూరు, వేమూరు ఎస్ఐలు ఏడుకొండలు, రవికృష్ణ కోడి పందాల బరి వద్దకు వస్తున్నారని నిర్వాహకులకు సమాచారం అందడంతో పందాలు వేయకుండా నిలిపి వేశారు. ఇరువురు ఎస్ఐలు కోడి పందెం బరి వద్దకు వెళ్లేసరికే అక్కడ పందాలు జరగకపోవడంతో వెనుదిరిగారు. కోడి పందాలలో లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు తెలుస్తోంది.

ఢిల్లీలోని ఎన్జీ రంగా సమాధిని సంరక్షించాలి : కొల్లా

బాపట్ల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఓపెన్ యూనివర్సిటీ సమీపంలో గల ఫ్రీడమ్ ఫైటర్స్ ఎన్‌క్లేవ్‌లో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన స్వాతంత్ర్యసమరయోధులు, రైతుబాంధవులు ఆచార్య ఎన్జీరంగా సమాధిని దుండగులు ధ్వంసం చేసి కబ్జా చేయటం దారుణమని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. ఎన్జీరంగా సమాధితోపాటు ఆయన శిష్యుడు అప్పటి స్వాతంత్ర్యసమరయోధుల సంఘం కార్యదర్శిగా పనిచేసిన బాపట్ల రైలుపేటకు చెందిన వీఎల్ సుందరరావు సమాధిని కూడా దుండగలు ధ్వంసం చేసి స్వాధీనం చేసుకోవటం బాధాకరమన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని ఢిల్లీలోని స్వాతంత్ర్యసమరయోధుల సమాధులకు జరిగిన అపచారాన్ని సరిదిద్ది వారి స్మృతి చిహ్నాలకు సమున్నత గౌరవం కల్పించాలని కొల్లా కోరారు.

జాతికి అవమానం : డాక్టర్ పీసీ సాయిబాబు

ఆచార్య ఎన్జీరంగా, వీఎల్ సుందరావు స్మారకాలు, సమాధులు ధ్వంసం చేయటం జాతికి అవమానకరమని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ సాయిబాబు అన్నారు. వారి స్మారకాలను యుద్ధప్రాతిపదికన పునఃనిర్మించాలని ఈ విషయంలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చొరవ తీసుకోవాలని కోరారు.

సూర్యలంకలో నెహ్రూ యువకేంద్రం విద్యార్థుల పర్యటన

బాపట్ల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : అంతరాష్ట్రాలలో పర్యటనలో భాగంగా గుంటూరు నెహ్రూ యువకేంద్రం చెందిన 30 మంది విద్యార్థులు బుధవారం బాపట్ల మండలం సూర్యలంక తీరం, ఆదర్శనగర్ గ్రామాలలో పర్యటించారు. మత్స్యకారులు చేపల వేట వలన జరుగు జీవనవిధానాన్ని గురించి అడిగి తెలుసుకున్నారు. సూర్యలంక బీచ్‌ను సందర్శించి అక్కడ ఉన్న శివాలయాన్ని సందర్శించారు. బాపట్లలో, పరిసర ప్రాంతాలలో అభివృద్ధిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ కిరణ్మయిదేవి, సీతారాంవరప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

బాపట్ల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణంలోని భావన్నారాయణ స్వామి దేవాలయ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గమనించారు. పట్టణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.


గోవాడ ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు


శ్రీ బాలకోటేశ్వరస్వామికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

శివనామ స్మరణ మారుమోగిన ఆలయాలు

- భక్తులతో కిటకిటలాడిన గోవాడ

అమృతలూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రం గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయం భక్తజన సందోహంతో కిటకిటలాడింది. లక్షలాది మంది భక్తులు బాలకోటేశ్వర స్వామిని బుధవారం దర్శించుకున్నారు. శ్రీబాలకోటేశ్వర స్వామి దర్శనానికి మంగళవారం అర్ధరాత్రి నుంచి భక్తుల తాకిడి ప్రారంభమైంది. అభిషేక మండపంలో అభిషేకాలు జరిపించుకొనేందుకు భక్తులు బారులు తీరారు. క్యూలైన్లు విస్తృతంగా ఏర్పాటు చేయడంతో పోలీసులు, దేవాదాయ సిబ్బంది, పర్యవేక్షణలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. సవారీ, ట్రాక్టర్లపై రైతులు తరలివచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు. రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు స్వామి వారిని దర్శించుకున్నారు. ఫెస్టివల్ ప్రత్యేక అధికారి అనుపమ, ఈవో అశోక్‌కుమార్, పర్యవేక్షణ కమిటీ సభ్యులు ఆలయ ఏర్పాట్లు పర్యవేక్షించారు. పంచాయతీ, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఎంపీడీవో కార్యాలయం, ప్రొహిబిషనరీ శాఖ, వైద్య ఆరోగ్య శాఖల వారు తాత్కాలిక కార్యాలయాలు ఏర్పాటు చేశారు. దాత విష్ణుమొలకల లక్ష్మీ వరప్రసాద్ భక్తులకు తాగునీటి ప్యాకెట్లు అందించారు. ఆలయ ప్రాంగణంలో పలు సేవా సంఘాలు, భక్తులకు అన్నదానం పులిహోర, ప్రసాదం పంపిణీ చేశారు. కాకతీయ, ఆర్యవైశ్య, బ్రహ్మణ, శాలివాహన, లీలా భవానీ పద్మశాలీయ సత్రాల్లో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. పలు సంఘాల దేవాలయ ప్రాంగణంలో పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు.

పులిహోర పంపిణీ చేసిన మంత్రి అనగాని

మహాశివరాత్రి ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రారంభించారు. ఆయన వెంట సోదరుడు అనగాని శివప్రసాద్, కృష్ణా పశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు తదితరులు ఉన్నారు.

బాలకోటేశ్వరస్వామికి పట్టువస్త్రాలను సమర్పించిన మంత్రి


మహాశివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన 60 అడుగుల ఉప్పూడి ప్రభ

రేపల్లె, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : రేపల్లె మండలం అరవపల్లిలో ఉన్న శ్రీ గంగాపార్వతి సమేత బాలకోటేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని అర్ధరాత్రి నుంచి స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, పంచామృతాలతో అభిషేకం, వివిధ పళ్ళ రసాలు, పూలతో అభిషేకం ఆలయ అర్చకులు నిర్వహించారు. మండలంలోని దక్షిణ కాశిగా పేరొందిన మోర్తోట శ్రీ ముక్తేశ్వరస్వామి దేవాల యం చుట్టూ భక్తులు పశువులను, ప్రత్యేకంగా అలంకరించిన ప్రభల ను, వాహనాలను ఆలయాల చుట్టూ తిప్పారు. బాలకోటేశ్వరస్వామికి రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ పట్టు వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు పూలమాలలు, దుశ్శాలువాలు వేసి సన్మానించారు. అరవపల్లి గ్రామదేవత అయిన గొల్లభామకు భక్తులు సద్ది నైవేద్యాలు, పొంగళ్ళు సమర్పిం చారు. పోలీసుల ఆధ్వర్యంలో సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. పెద్దఅరవపల్లి గ్రామం నుంచి 70 అడుగుల ప్రభ, ఉప్పూడి నుంచి 60 అడుగుల ప్రభ, రేపల్లె పట్టణం నుంచి కొన్ని ప్రభలు డీజే బాక్సులు భక్తుల సౌండ్‌లతో ప్రభలను ఆలయం చుట్టూ తిప్పి తమ మొక్కులను తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్, ఆలయ కార్యనిర్వహణాధికారి దివి వెంకట అప్పలాచార్యులు, పూజా కార్యక్రమాల్లో కృష్ణా పశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, అనగాని శివప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి తాతా ఏడుకొండలు, కొపనాతి రాజశేఖర్, దండమూడి ధరణికుమార్, పంతాని సాయికుమార్, దేవగిరి రవిశంకర్, రేపల్లె సురేష్, వడ్డి లక్ష్మీజీ, మేకా వెంకట శివరామకృష్ణ, కొలసాని రాము, బొందలపాటి మల్లికార్జునరావు, వేమూరి శ్రీనివాసరావు, బొడ్డు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పట్టణంలోని శ్రీ స్వయంభూ రామలింగేశ్వరస్వామి ఆలయం, ఇసుకపల్లిలోని శ్రీభ్రమరాంబ చెన్నమల్లేశ్వరస్వామి దేవాలయం, ఓల్డ్‌టౌన్‌లోని శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయం, మండలంలోని చోడాయపాలెంలో చౌడేశర్వరస్వామి దేవాలయం, నిజాంపట్నం మండలం గోకర్ణమఠంలోని శ్రీ గోకర్ణేశ్వరస్వామి, కొత్తపాలెంలోని శివాలయంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పరిటాల యువసేన ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ, తెలుగు యువత అధ్యక్షుడు కొలసాని రాము ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అల్పాహారాన్ని మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రారంభించి అందించారు. వేదగాయిత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ అందించారు. అరుణశ్రీ వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అరుణశ్రీ సంఘం సభ్యులు మురళీకృష్ణ పాల్గొన్నారు. బాలకోటేశ్వరస్వామి ఆలయ సమీపంలో వాసవీ క్లబ్ వనిత, మైత్రీ కపుల్స్ సంయుక్తంగా భక్తులకు శనగల ప్రసాదం పంపిణీ చేశారు. విశ్వేశ్వరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అరవపల్లి బాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద వైద్యులు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వృద్ధులకు గ్లూకోజ్, శక్తినిచ్చే టానిక్స్‌ను సరఫరా చేశారు. వృద్ధుల మోకాళ్ళ నొప్పులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

బాపట్లలో...


ఎస్ఎన్‌పీ అగ్రహారంలో ప్రత్యేకంగా అలంకరించిన శ్రీ రామలింగేశ్వరస్వామి

బాపట్ల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చారిత్రక ప్రసిద్ధిగాంచిన శ్రీ గంగాపార్వతి సమేత శ్రీ సోమేశ్వరస్వామి దేవాలయం, ఎస్ఎన్‌పి అగ్రహారంలోని శ్రీ గంగాపర్వతి వర్ధిని సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం, కొత్త బస్టాండ్ కూడలిలోని శ్రీ ఉమామహేశ్వరస్వామి దేవాలయం, వెదుళ్ళపల్లిలో ఉన్న శ్రీ గంగా పర్వత వర్ధని సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయాలలో శివరాత్రి పూజా కార్యక్రమాలు విశేషంగా జరిగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకొని అభిషేకం చేశారు. అనంతరం మహారుద్రుని స్వామివారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తబృందం శివనామ ఏకాహం ప్రారంభించారు.

సూర్యలంక శివక్షేత్రంలో ఎమ్మెల్యే నరేంద్రవర్మ పూజలు


సూర్యలంకలో ఉన్న శివక్షేత్రంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం సూర్యలంకలో ఉన్న శివక్షేత్రంలో శ్రీతారకేశ్వరస్వామివారికి మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆ పరమేశ్వరుని ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై మెండుగా ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

బాపట్ల మండలంలో...

బాపట్లరూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం అప్పికట్లలో ఉన్న శ్రీగంగా అన్నపూర్ణా విశాలక్ష్మీసమేత కాశీవిశ్వేశ్వర స్వామికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించగా భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. గురువారం స్వామివారికి రథోత్సవం, శుక్రవారం మధ్యాహ్నం అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహణాధికారి నిమ్మగడ్డ రవికుమార్ తెలిపారు. నాగేంద్రపురంలో ఉన్న నాగేంద్రస్వామి దేవాలయ ఆవరణలో తిరునాళ్ళను గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. విద్యుత్‌ప్రభలు, కోలాటభజనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

పిట్టలవానిపాలెం మండలంలో...


మంతెనవారిపాలెంలో ఉన్న శ్రీరామలింగేశ్వస్వామి

పిట్టలవానిపాలెం ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలులో ఉన్న శ్రీ లింగోద్భవస్వామి దేవస్థానంలో బుధవారం తెల్లవారు జాము 4 గంటల నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. పంచామృతాలతో, ఏకాదశ రుద్రాభిషేకాలను దేవస్థానం వంశపారంపర్య అర్చకస్వాములు దండిభొట్ల తారకరాంబాబు, శ్రీనివాసశాస్త్రి, బాలవెంకటేశ్వర్లు బృందం ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ త్రిముఖ దేవాలయాలకు చెందిన ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి పర్యవేక్షణలో భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయంలో గల 11 అడుగుల ప్రాచీన సాలగ్రామ చింతామణి మహాశివలింగానికి పూజలు నిర్వహించుకున్నారు. చందోలు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు దేవస్థానం తరుపున స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

మండలంలోని ఖాజీపాలెంలో ఉన్న శ్రీ గంగా అన్నపూర్ణసమేత కాశీవిశ్వనాధస్వామి వారి దేవస్థానంలో కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు, ఆలయ అభివృద్ధి కమిటీ ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎం.విజయ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. మంతెనవారిపాలెంలో ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామివారి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

వేమూరు మండలంలో...


జంపనిలో 108 పవిత్ర జల కలశాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

వేమూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండల పరిధి గ్రామాల్లోని శివాలయాల్లో వార్షిక విశేష కార్యక్రమాలు నిర్వహించారు. జంపని రామేశ్వరాలయంలో పండిత మామిళ్లపల్లి వెంకటసుబ్బరాయశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం వివిధ పవిత్ర జలాలతో కూడిన 108 కలశాలను భక్తులు తమ శిరస్సులపై ధరించి గ్రామంలో ఊరేగింపు అనంతరం శివునికి ఆ జలాలను అభిషేకించారు. తిరుమల తిరుపతి దేవస్థానాల దాస సాహిత్య ప్రాజెక్టు భజన సంఘాల వారు కోలాట భజనలు ప్రదర్శించారు. సాయంత్రం కల్యాణోత్సవం జరిపి రాత్రి 12 గంటల సమయంలో లింగోద్భవ కాల అభిషేకం జరిపారు. చావలి వాలేశ్వరాలయంలో అఖండ జ్యోతి ప్రజ్వలన చేశారు. పెరవలి, వేమూరు శివాలయాల్లో ఏకాదశ రుద్రాభిషేకాలు బిల్వమార్చనలు జరిపారు. అబ్బనగూడవల్లి, బూతుమల్లి, చదలవాడ, వరహాపురం, చంపాడులోని శివాలయాలలో రుద్రాభిషేకాలు జరిపారు.

చుండూరులో...

చుండూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా చుండూరులోని శ్రీబాలకోటేశ్వరస్వామి తిరునాళ్ల ఉత్సవాలలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. స్వామి వారి పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. విద్యుత్ ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మండల ఆర్యవైశ్య సంఘం, బ్రాహ్మణ సంఘం, కాపు సేవా సమితి ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని వలివేరు, చినపరిమి, మోదుకూరు, యడ్లపల్లి, వేటపాలెం శివాలయాలు మహారుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. చుండూరు తిరునాళ్లలో ఎమ్మెల్యే ఆనందబాబు వెంట బాపట్ల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు తమ్మా శివారెడ్డి, గుదేటి యల్లారెడ్డి, బాలకోటిరెడ్డి, కుర్రి వెంకటరెడ్డి, కావూరి శ్రీనివాసరావు, రాయపాటి శ్రీనివాసరావు, భీమవరపు శ్రీమాన్, తియ్యగూర రాఘవరెడ్డి, అన్నపరెడ్డి శంకరరెడ్డి, శరత్‌బాబు పాల్గొన్నారు.


చినపరిమి దేవాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

కొల్లూరులో...


ప్రత్యేక అలంకారంలో అనంత భోగేశ్వరస్వామి

కొల్లూరు, భట్టిప్రోలు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కొల్లూరులోని అనంత భోగేశ్వర స్వామి, కోటిపల్లిలోని స్వయంభు సోమశేఖర స్వామి, చిలుమూరులోని శ్రీరాము నితో ప్రతిష్ఠింపబడిన ఉభయ రామేశ్వరస్వామి ఆలయాలు తెల్లవారు జాము నుండే భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆయా ఆలయాల్లో స్వామిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించారు. కోటిపల్లిలో రైతులు తమ పాడిపశువులు, మూగజీవాలతో ఆల య ప్రదక్షిణలు చేశారు. రాత్రి వేళ స్వామి, అమ్మవార్లకు వార్షిక శాంతి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. భట్టిప్రోలు మండల పరిధిలోని సూరేపల్లిలో ఉన్న వాయులింగేశ్వరస్వామికి భక్తులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించి అనంతరం గ్రామోత్సవం జరిపారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో శివనామస్మరణ మధ్య లింగోద్భవ కాల రుద్రాభిషేకాన్ని ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. బాలాత్రిపుర సుందరి సమేత విఠలేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. కళ్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. సూరేపల్లిలో స్వామి వారి కళ్యాణం అత్యంత వైభవంగా జరిపారు.

కర్లపాలెం మండలంలో...


అన్నప్రసాద వితరణ చేస్తున్న నామన వెంకటశివన్నారాయణ

కర్లపాలెం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని శివాలయాలు బుధవారం భక్తులతో పోటెత్తాయి. కర్లపాలెంలోని శ్రీగంగా గౌరి సమేత బదరికేదారేశ్వరస్వామి శివాలయం, పేరలి, గణపవరం, పెదగొల్లపాలెం, నల్లమోతువారిపాలెంలోని శ్రీలలితత్రిపురసుందరి ఆలయం, విద్యాచైతన్యపీఠం, కొత్తనందాయపాలెం శివాలయం, ఎంవిరాజుపాలెం పుట్ట దగ్గర పూజారులు శ్రీశివపార్వతులకు విశేష పూజలు, అభిషేకాలను కన్నులపండుగగా నిర్వహించారు. కర్లపాలెం శివాలయంలో నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ పార్టీశ్రేణులతో కలిసి వచ్చి అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో చిలక సురేంద్ర, హుస్సేన్‌బేగ్, ఆకిశెట్టి విజయమాధురి, గుర్రపుసాల వెంకటేశ్వరమ్మ, జగ్గయ్య, శ్రీకాంత్, నాగమల్లేశ్వరి, నామన శ్యామ్‌కుమార్, పి.సురేష్, ఇక్కుర్తి చక్రపాణి, కాటూరి రత్నకుమార్, షేక్ జహీర్‌బాషా, సీహెచ్ సత్యనారాయణ, సింగిరిశెట్టి సంజయ్యనాయుడు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలందరూ శివుని ఆశీస్సులు పొందాలి : సీఐ

ప్రజలందరూ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని బాపట్ల రూరల్ సీఐ హరికృష్ణ, కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర ఆకాంక్షించారు. కర్లపాలెం పంచాయతీ పరిధిలోని శ్రీ గంగా గౌరిసమేత బదరికేదారేశ్వరస్వామి దేవాలయంలో మహన్యాసకపూర్వక రుద్రాభిషేకం పూజలు నిర్వహించగా హరికృష్ణ, రవీంద్రలు పూజలో పాల్గొన్నారు.

భక్తుల సేవలో తరించిన సత్రాలు


ఆర్యవైశ్య సత్రంలో అన్నదానం ప్రారంభిస్తున్న సత్రం అధ్యక్షుడు కొత్తమాసు సాంబశివరావు

అమృతలూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినం రోజున ఉత్సవాలకు విచ్చేసిన భక్తుల సేవలో అన్నదాన సత్రాలు తరించాయి. ఆలయం సమీపంలోని శ్రీ బాలకోటేశ్వర కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య శ్రీయెనిశెట్టి రంగనాయకుల శ్రేష్టి అన్నదాన సత్రంలో ఆర్యవైశ్యులకు అన్నదానం చేశారు. అన్నదానంను సత్రం అధ్యక్షుడు కొత్తమాసు సాంబశివరావు ప్రారంభించారు. 62వ సంవత్సరం అన్నదానం చేసినట్లు చెప్పారు. సమీప జిల్లాల నుంచి కూడా తిరునాళ్ళకు వచ్చిన ఆర్యవైశ్య భక్తులకు అన్నదానం చేసినట్లు తెలిపారు. సత్రంకు విచ్చేసిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబును సత్కరించారు. ఏర్పాట్లను కొత్తమాసు రమణకుమార్, శిఖాకొల్లి తాండవకృష్ణ, తమ్మన సాంబశివరావు, కపలవాయి శ్రీనివాసరావు, కొమ్మూరి మురళీకృష్ణ, చేబ్రోలు వెంకటేశ్వర్లు, తూనుగుంట్ల వెంకట సుబ్బారావు, చీమకుర్తి మోహన వెంకటేశ్వరరావు, నేరెళ్ళ వెంకట సుబ్బారావు, పోట్టి శ్రీధర్ పర్యవేక్షించారు.

ఎఫ్ఆర్‌టీఐ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆవుల వెంకటేశ్వర్లు

బాపట్ల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఫోరం ఫర్ ఆర్టీఐ మాజీ సైనికుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ఆవుల వెంకటేశ్వర్లుకు జాతీయ అధ్యక్షుడు పత్తిపాటి చంద్రమోహన్ నియామక పత్రాన్ని అందజేశారు. స్థానిక ఎన్జీవో హోమ్‌లో ఫోరం ఫర్ ఆర్టీఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మద్దిబోయన అమృతరాజ్ అధ్యక్షతన నిర్వహించగా చంద్రమోహన్ మాట్లాడుతూ దేశానికి సేవలందించిన ఆవుల వెంకటేశ్వర్లు పేద ప్రజల సమస్యల పరిష్కారానికి ఆర్టీఐ ద్వారా అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వంతో కలిసి కృషి చేయాలని తెలిపారు. రాష్ట్ర ఎన్జీవోస్ సంఘం నాయకులు పి.నాగేశ్వరరావు, పులి శేషగిరి, ఎఫ్ఆర్‌టీఐ నాయకులు రాము, బడుగు కిషోర్, కె.హేబెల్, అమృత పాల్గొన్నారు.

సర్వం శివమయం

- కిటకిటలాడిన శైవక్షేత్రాలు
- ప్రత్యేక అభిషేకాలు, హోమాలు, పూజలు
- అర్ధరాత్రి లింగోద్భవం అద్భుతం
- పరవశించిన భక్తకోటి

చీరాల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : బుధవారం చీరాల నియోజకవర్గ పరిధిలో ఆలయాలు శివ నామ స్మరణతో మార్మోగాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక హోమాలు, రుద్రాభిషేకం, పూజలను మంగళవారం ఉదయం నుంచి గురువారం వేకువజాము వరకూ నిరంతరాయంగా నిర్వహించారు. విశేష పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శైవక్షేత్రాలను నిర్వాహకులు అపురూపంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ నేపథ్యంలో వేకువ జాము నుంచే ఆలయాల వద్ద బారులు తీరారు. పోలీసులు ఆయా ఆలయాల వద్ద ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా భద్రతా ఏర్పాట్లు చేశారు. పూజలు అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. అలాగే రాత్రికి శివోద్భావ అభిషేకాలు, హోమాలు, జాగారం వంటివి భక్తులు భక్తిశ్రద్ధలతో పాటించారు.

అద్దంకి : శివాలయాలు శివ నామస్మరణతో మార్మోగాయి. చిన కాశీగా ఖ్యాతికెక్కిన మణికేశ్వరంలోని మల్లేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య దంపతులు మణికేశ్వరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర రాత్రి లింగోద్భవ కాలంలో రుద్రాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారికి పట్టు వ స్త్రాలను మున్సిపల్ చైర్మన్ ఎస్తేరమ్మ, పలువురు కౌన్సిలర్‌లు ఊరేగింపుగా తీసుకు వెళ్లారు. వేయి స్తంభాల గుడి, కమేశ్వరాలయం లలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

పంగులూరు : మండలంలోని అన్ని ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. పంగులూరు, రామకూరు, చందలూరు, మల్లవరం పరిసర గ్రామాలలో భక్తులు అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకోవడంతో ఆధ్యాత్మిక సందడి నెలకుంది. పంగులూరు, చందలూరులో శివ నామ జపంతో ఏకాహం నిర్వహించారు.



చీరాల శివాలయంలో ప్రత్యేక అలంకరణలో



దైవాలరావూరులోని ఉమామహేశ్వరస్వామికి పూజలు



అద్దంకిలోని పాత శివాలయంలో ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి, మణికేశ్వరంలోని మల్లేశ్వరస్వామి

మేదరమెట్ల : మహాశివరాత్రి పర్వదినాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. దైవాలరావూరులోని ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. మేదరమెట్లలోని మల్లేశ్వరస్వామి, రావినూతల, కొరిశపాడు, పాసంగులపాడు, పమిడిపాడు తదితర గ్రామాల్లో ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కల్యాణ మహోత్సవం నిర్వహించారు.

రామలింగేశ్వరస్వామికి శాంతి కల్యాణం

సంతరావూరు (చినగంజాం) : మండలంలోని సంతరావూరు గ్రామంలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వారికి బుధవారం శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రావూరి నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను శేష వస్త్రాలతో, పూలమాలలతో విశేషంగా అలంకరించి, జరుబుల వేణుగోపాలరావు సంధ్యారాణి దంపతులచే వేద మంత్రోచ్చరణ నడుమ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ట్రాక్టర్‌లో దేవతా మూర్తులను గ్రామంలోని పురవీధులలో మంగళవాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సంతరావూరు దేవదాయశాఖ ఈవో పోతిన శ్రీనివాసరావు, టీడీపీ సీనియర్ నాయకురాలు యార్లగడ్డ లక్ష్మి, గ్రామ పెద్దలు నార్ని ఆంజనేయులు, తోటకూట సుబ్బారావు, భక్తులు పాల్గొన్నారు.

మార్టూరు : షట్టేశ్వరస్వామి, దుర్గామల్లేశ్వరస్వామి ఆలయాల్లో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గన్నవరం రోడ్డులో బొబ్బేపల్లి దండుదారి వద్ద పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో గోవిందమాంబ వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

పర్చూరు : పర్చూరు భీమేశ్వరస్వామి ఆలయం, నాగులపాలెం నాగేశ్వరస్వామి, ఉప్పుటూరు అమరేశ్వరస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి, చెరుకూరు అగస్త్యేశ్వరస్వామివారి ఆలయంతోపాటు, అడుసుమల్లి గంగా పార్వతి సమేత గౌరీశంకర ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అన్నంబొట్లవారిపాలెంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో జరిగిన పూజల్లో హైకోర్టు న్యాయమూర్తి సురేష్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. న్యాయమూర్తిని అర్చకులు, న్యాయాధికారి శాంతి స్వాగతం పలికారు. బోడవాడ గ్రామంలోని శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి కల్యాణ మహోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి.

ఘనంగా రుద్రాభిషేకం

బల్లికురవ : మండలంలోని కొండాయపాలెం గ్రామంలో బుధవారం రాత్రి శివ నామస్మరణలో భక్తులు మునిగి తేలారు. గ్రామానికి చెందిన నీలకంఠేశ్వర స్వామి దేవాలయ ధర్మకర్త ధూళిపాళ్ల రామగోవిందు పూర్తి సహాయ సహకారాలతో గుంటూరు జిల్లా ఫిరంగిపురం వేమవరం వద్ద ఉన్న కోటి లింగాల సహాయార్థం అమ్మ ఆశ్రమానికి చెందిన జ్ఞాన ప్రసూన బాబా ఆధ్వర్యంలో శిష్య బృందం మహా రుద్రాభిషేకం, మహా భస్మాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా మట్టి శివలింగానికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలు గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చి గంటపాటు భక్తిశ్రద్ధలతో చూసి తరించారు. వేల బిందెల నీటిని తెచ్చి శివుడికి అభిషేకం చేశారు. మారుముల గ్రామంలో ఇలాంటి కార్యక్రమం ఏర్పాటు చేయడం శుభం అని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. రుద్రాభిషేకం అనంతరం వచ్చిన భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.



కొండాయపాలెంలో మహా రుద్రాభిషేకం చేస్తున్న జ్ఞాన ప్రసూన బాబా, శిష్య బృందం



శివాలయంలో పూజలు చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి సురేష్‌రెడ్డి

ఘనంగా అంకమ్మకు కుంకుమార్చన



బిందెల సేవ పూజలో పాల్గొన్న మహిళా భక్తులు

చీరాల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెంలో వేంచేసి ఉన్న అంకమ్మ తల్లి వార్షికోత్సవంలో భాగంగా బుధవారం పసుపు, కుంకుమ సేవా కార్యక్రమం నిర్వహించారు. దీంతో మహిళలు పుణ్య స్నానాలు ఆచరించి బిందెల సేవా కార్యక్రమం జరిపారు. అలాగే మేళతాళాలతో గ్రామంలో ఊరేగింపు జరిగింది. ఆయా పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నృత్యాలు చేశారు.

పెట్రోల్ బంకుల్లో 'గాలి'కి వదిలేశారు



అద్దంకిలో పెట్రోల్ బంక్‌లో వినియోగంలో లేని గాలి మిషన్

అద్దంకి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై అన్ని రకాల సుంకాలు వసూలు చేసే పెట్రోల్ బంక్‌ల నిర్వాహకులు గాలి మిషన్, మరుగుదొడ్లు తదితర సౌకర్యాల నిర్వహణను పూర్తిగా గాలికి వదిలేశారన్న విమర్శలు వస్తున్నాయి. సెలవు రోజులైతే బయట గాలి మిషన్‌లు మూసి వేసినప్పుడు వాహనచోదకులకు చుక్కలు కనిపిస్తున్నాయి. అద్దంకి పట్టణం లో 9 పెట్రోల్ బంకులు ఉన్నాయి. వీటిలో రెండు, మూడింటిలో మాత్రమే గాలి మిషన్‌లను వినియోగిస్తుండగా, మిగతా వాటిలో ఆ ఊసే లేదు. సం వత్సరాల తరబడి అవి మూలన పడి ఉన్నాయి. ఇక మరుగుదొడ్ల పరిస్థితి మరింత దారుణంగా ఉందన్న విమర్శలు వస్తున్నాయి. దీంతో వాహనచోదకులకు తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పం దించి అన్ని పెట్రోల్ బంకులలో గాలి మిషన్, మరుగుదొడ్ల ఇతర అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ఎక్సైజ్ కేసుల్లో 29 నేరాలకు సీసీ నెంబర్స్

- పెండింగ్‌లో మరో 23
- ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు



ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు

చీరాల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : చీరాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌కు సంబంధించిన ఇటీవల నమోదు చేసిన 52 కేసుల్లో 29కి సీసీ నెంబర్స్ అందినట్లు ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు తెలిపారు. మొత్తం కేసులకు చార్జిషీట్ కోర్టులో దాఖలు చేయగా పెండింగ్‌కు సంబంధించి త్వరలోనే సీసీ నెంబర్స్ వస్తాయ ని తెలిపారు. సీసీ నెంబర్‌లు అందిన కేసులు కోర్టు పరిధిలోకి చేరినట్లు వివరించారు. ప్రభుత్వం ప్రవే శపెట్టిన నిబంధనలు అనుసరించి మాత్రమే మద్యం క్రయవిక్రయాలు జరగాలని భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

నూతలపాడు (పర్చూరు), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలం నూతలపాడులో బుధవారం పేకాట శిబిరంపై పోలీసులు దాడిచే, ఐదుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.14,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

ఘాట్‌లో స్నానాలు నిషేధం

శివయ్య భక్తులలో నిరాశ

అద్దంకి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి రోజు గుండ్లకమ్మ నదిలో స్నానాలు చేసి శివయ్యను దర్శించుకుందామనుకున్న భక్తులకు నిరాశే మిగిలింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రధాన శివాలయాలలో ఒకటిగా ఉన్న మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయంకు మహాశివరాత్రి, కార్తీక మాసంలో పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు. దేవాలయానికి వచ్చిన భక్తులు గుండ్లకమ్మ నదిలో స్నానాలు చేసి స్వామి వారిని దర్శించుకుంటారు. గత ఏడాది గుండ్లకమ్మ నదిలో నీరు పూర్తి స్థాయిలో ఉండి కూడా భక్తులు స్నానాలు చేసే అవకాశం లేకుండా పోయింది. చేపల చెరువుల నుంచి వ్యర్థాలను రిజర్వాయర్ నీటిలోకి వదలడంతో ఆ వ్యర్థాలన్నీ మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయం వద్ద ఉన్న స్నానాల ఘాట్ వద్ద నీటిపై పేరుకు పోయాయి. అదే సమయంలో పూర్తిస్థాయిలో నీరు ఉన్నాయి. దీంతో స్నానాల ఘాట్ పూర్తిగా మూసి వేసి అడ్డుగా బారికేడ్‌లను ఏర్పాటు చేశారు. దీంతో గుండ్లకమ్మ నదీ స్నానాలు చేద్దామని వచ్చిన భక్తులు ఒకింత నిరాశకు గురయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చేపల చెరువుల కలుషిత నీరు రిజర్వాయర్ నీటిలో కలవకుండా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. లేకుండా కార్తీక మాసం లో కార్తీక స్నానాలు చేసే భక్తులు కూడా ఇబ్బంది పడాల్సి వస్తుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మణికేశ్వరం వద్ద గుండ్లకమ్మ నదిలో స్నానాలు చేయకుండా ఏర్పాటు చేసిన బారికేడ్‌లు, నిషేధ ఫ్లెక్సీ

వైట్‌బర్లీ రైతులకు కూలీల కొరత

- చేతికి వచ్చినా దక్కించుకోలేని పరిస్థితి
- కోత కోసేవారు కరువు
- కర్నూలు, కడప, శ్రీకాకుళం నుంచి వస్తున్నా చాలని వైనం
- మరోపక్క దిగజారుతున్న ధరలు

పర్చూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఓ పక్క గణనీయంగా సాగు విస్తీర్ణం.. మరో పక్క పెరిగిన వ్యవసాయ ఖర్చులు, అరకొర దిగుబడులు, దిగజారుతున్న ధరలతో వైట్ బర్లీ రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది. గత ఏడాది సాగుచేసుకున్న మిర్చి పైరుకు జెమినీ తెగులు సోకి తీవ్రంగా దెబ్బతినడం, గత ఏడాది వైట్‌బర్లీ పొగాకు దిగుబడితో పాటు ధర ఆశాజనకంగా ఉండడంతో అధిక శాతం మంది రైతులు వైట్‌బర్లీ పొగాకును సాగుచేసుకున్నారు. గతంతో ఎన్నడూ లేని విధంగా పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని పర్చూరు, మార్టూరు, యద్దనపూడి, కారంచేడు మండలాల పరిధిలో దాదాపు రూ.40వేల ఎకరాలకు పైగా రైతులు వైట్ బర్లీ పొగాకును సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.60వేల ఎకరాల్లో వైట్‌బర్లీని సాగు చేయగా అందులో పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లోని అధికశాతం సాగుచేయడం ఇందుకు నిదర్శనం. ఎక్కువ విస్తీర్ణంలో వైట్‌బర్లీని సాగుచేయడం పంట అంతా ఒకే సారి అందుబాటులోకి రావడంతో కూలీల కొరత తీవ్రంగా మారింది. అధిక కూలీని చెల్లించినా కూలీలు దొరికే పరిస్థితి లేకుండా పోయింది. కర్నూలు, కడప, శ్రీకాకుళం తదితర జిల్లాల నుంచి కూలీలను దిగుమతి చేసుకున్నా పూర్తి స్థాయిలో కూలీలు దొరుకుతున్న దాఖలాలు లేవు. దీంతో పొలంలోనే ఆకలు కోతకు వచ్చి ఎండిపోతున్నా ఏమీ చేయలేని పరిస్థితిలో రైతులు ఉన్నారు. తాళ్లకు గుచ్చిన పొగాకును సైతం పందిళ్లకు కట్టుకోలేక కిందనే పడేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం ఉన్న వైట్‌బర్లీ ధరలను చూస్తుంటే కూలీ ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తాళ్లకు గుచ్చినా పందిళ్లకు కట్టలేక నేలపైనే ఉంచిన పొగాకు



కూలీలు దొరక్క ఎండిపోతున్న పొగాకు



రాజుగారిపాలెం వాగు వద్ద ఉన్న గ్రానైట్ వ్యర్థాలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించివేస్తున్న టీడీపీ నాయకుడు శ్రీనివాసరావు

గ్రానైట్ వ్యర్థాలు తొలగింపు

మార్టూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రాజుగారిపాలెం వాగువద్ద పడవేసిన గ్రానైట్ వ్యర్థాలను బుధవారం ఎట్టకేలకు తొలగించారు. ఈనెల 23వ తేదీన ఆంధ్రజ్యోతిలో రాజుగారిపాలెం వాగువద్ద గ్రానైట్ వ్యర్థాలు అని ప్రచురించిన వార్తపై జిల్లా పంచాయతీ అధికారులు స్పందించారు. వారి ఆదేశాలు మేరకు పంచాయతీ కార్యదర్శి అశోక్ గ్రానైట్ వ్యర్థాలను తొలగింపు చేసేందుకు గ్రామంలోని టీడీపీ నాయకులు చింతలపూడి శ్రీనివాసరావును సంప్రదించారు. దాంతో ఆయన సొంతంగా ఎక్స్‌కవేటర్ సహాయంతో గ్రానైట్ వ్యర్థాలను వాగు నుంచి పూర్తిగా తొలగించారు. దాదాపుగా రెండు గంటలు పనిచేసి వాగు పరిసరాలను శుభ్రం చేశారు. భవిష్యత్‌లో మరల వాగువద్ద గ్రానైట్ వ్యర్థాలను వేయకుండా పంచాయతీవారి ఆధ్వర్యంలో బోర్డులను ఏర్పాటు చేస్తామని అశోక్ తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

చీరాల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : జయంతి పేటలో వ్యక్తి బలవన్మరణం చెందాడు. అందిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా పొదిలికి చెందిన గడ్డం హరి(40) బేల్దారి మేస్త్రి. ఇతనికి భార్య, ముగ్గురు సంతానం. కొంత కాలంగా భార్య సొంతూరు జయంతి పేటలోనే నివాసం ఉంటున్నాడు. ఈక్రమంలో ఇటీవల హైదరాబాద్‌లో పనులకు వెళ్లి మూడు రోజుల కిందట వచ్చాడు. అయితే ఏమి జరిగిందో తెలియదు గానీ బుధవారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. ఈమేరకు సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

జూనియర్ కళాశాల యాజమాన్యం నోటి దురుసు

- ఫీజు చెల్లించలేదని విద్యార్థినిపై పరుష పదజాలం
- తల్లిదండ్రుల ఆగ్రహం
- పునరావృతం కాకుండా చూస్తామని ప్రతినిధుల హామీ

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఫీజు చెల్లింపులో రెండు రోజులు ఆలస్యం అయిందని కళాశాల యాజమాన్యం విద్యార్థులపై నోటి దుసురు వ్యాఖ్యాలు చేయడం అందరినీ బాధించింది. దీంతో విద్యార్థులు యాజమాన్యం అన్న మాటలను తల్లిదండ్రులకు చెప్పి, కళాశాలకు వెళ్లమని చెప్పడంతో తల్లిదండ్రులు ఆ కళాశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అద్దంకిలోని జూనియర్ కళాశాలలో జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఓ విద్యార్థిని ఫీజు చెల్లించడం రెండ్రోజులు ఆలస్యమైంది. రెండ్రోజుల్లో తండ్రి ఫీజు చెల్లిస్తారని చెప్పినా వినకుండా కళాశాల ఇన్‌చార్జి విద్యార్థినిపై దురుసుగా మాట్లాడారు. వెంటనే ఆ విద్యార్థిని తల్లిదండ్రులకు ఫోన్ చేసి విషయాన్ని తెలియజేసింది. దీంతో యాజమాన్యంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ పిల్లలపై అలా మాట్లాడితే మీకెలా ఉంటుందని నిలదీశారు. ఇకపై పిల్లలను కాలేజీకి పంపించమని తేల్చి చెప్పారు. విషయం తెలుసుకున్న కళాశాల మిగతా యాజమాన్యం తల్లిదండ్రులకు సర్దిచెప్పే ప్రయత్నంలో పడ్డారు. ఫీజు చెల్లించని కొందరు విద్యార్థులపై దురుసుగా మాట్లాడుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. పిల్లలను అలా అవమానించడం సరికాదని, మరోసారి ఇలా జరిగితే ఊరుకోమని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుం డా చూస్తామని యాజమాన్యం తల్లిదండ్రులకు నచ్చచెప్పి పంపించారు.

ఆటోను ఢీకొన్న ట్రాక్టర్.. డ్రైవర్‌కు గాయాలు

చిన్ననందిపాడు(పర్చూరు), ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) ఆటోను ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలైన ఘటన మండలం చిన్ననందిపాడు ఆర్‌అండ్‌బీ రోడ్డులో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పర్చూరులో కూలీలను పొలంవద్ద వదిలి పెట్టి తిరిగి వెళుతున్న క్రమంలో పెద్దనందిపాడు నుంచి చిన్ననందిపాడు వైపు వస్తున్న ట్రాక్టర్ ఆటోను బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటో దెబ్బతినడంతో పాటు డ్రైవర్ జూపూడి సునీల్‌కు గాయాలయ్యాయి. అతడిని 108లో ఆసుపత్రికి తరలించారు.

దాబాలో కోలలపూడి యువకుల వీరంగం

హోటల్ యజమానితోపాటు ఇద్దరు వ్యక్తులపై దాడి

మార్టూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలో జొన్నతాళి సెంటర్ సమీపంలోని ఒక దాబా హోటల్‌లో మండలంలోని కోలలపూడి గ్రామానికి చెందిన 8 మంది యువకులు వీరంగం సృష్టించారు. ఈ ఘటన బుధవారం రాత్రి జరిగింది. దాంతో వారికి నచ్చచెప్పడానికి ప్రయత్నించిన హోటల్ యజమాని గూగూలా, వంటమనిషి రాజుతో పాటు మరో కార్మికుడిపై ఆ యువకులు దాడి చేసి గాయపరిచారు. ఘటనకు సంబంధించి కోలలపూడికి చెందిన ఆర్‌ఎంపీ రావూరి శ్రీకాంత్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో 7 గురు వ్యక్తుల వివరాలు కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు.అందిన సమాచారం మేరకు.. కోలలపూడికి చెందిన 8 మంది యువకులు మద్యం మత్తులో దాబా హోటల్‌కు వచ్చి రొట్టెలు తిన్నారు. ఈ సమయంలో వారి మధ్య గొడవ జరగడంతో వారిని ఆపడానికి హోటల్ యజమాని గూగూల్‌తో పాటు మరో ఇద్దరు వర్కర్లు ఆపడానికి ప్రయత్నించారు. దాంతో వారు మరింత ఆగ్రహంతో హోటల్‌లో ఉన్న కుర్చీలను పగలగొట్టారు. అంతేగాకుండా సీసాలతో గూగూల్‌ను, రాజును గాయపరచగా, మరో వర్కర్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఈ విషయమై సమాచారం అందడంతో హెడ్ కానిస్టేబుల్ గరుత్మంతుడు, నాగేశ్వరరావుతో పాటు పోలీసులు వెళ్లగా వారందరూ పారిపోగా, రావూరి శ్రీకాంత్‌తో పాటు వారికి చెందిన రెండు మోటారు సైకిళ్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన గూగూల్, రాజును చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు విచారి స్తున్నారు.

ఛిద్రమైన చందలూరు, ఇంకొల్లు రోడ్డు

అడుగడుగునా గోతులతో రాకపోకలకు అంతరాయం

పంగులూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు నుంచి గంగవరం వైపుగా ఇంకొల్లు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు ఛిద్రమైంది. కంకర లేచిపోవడంతో పాటు అడుగుడుగునా ఏర్పడిన గుంతలతో ప్రయాణికులు నరకం చూస్తున్నారు. గ్రామానికి ఉత్తరంగా ఉన్న పొలాలకు వెళ్లే రైతులు ఈ రోడ్డు మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. చందలూరు, గంగవరం మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డు ఛిద్రమవడంతో పాటు ఏర్పడిన గోతులపై ప్రయాణం సాగించడం ఇబ్బందిగా ఉందని ద్విచక్రవాహన చోదకులు, ట్రాక్టర్ డ్రైవర్లు వాపోతున్నారు. అధికారులు మరమ్మతులు చేపట్టి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని కోరుతున్నారు.



కంకర లేచిన చందలూరు - గంగవరం రోడ్డు (ఇన్‌సెట్‌లో) చందలూరు - ఇంకొల్లు రోడ్డులో ఏర్పడి గుంత